
సాక్షి ఒడిశా

బుధవారం । 13 । సెప్టెంబర్ । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

నగదు రూ. 2,77,204
బంగారం 11 గ్రాముల 450 మిల్లీ గ్రాములు
వెండి 21 గ్రాములు - భువనేశ్వర్/పూరీ



ఆందోళన కొనసాగిస్తాం

తమ డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ చేస్తున్న రాష్ట్రస్థాయి ఆందోళన కొనసాగిస్తామని ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయుల సంఘం స్పష్టం చేసింది.

- 8లో



ఆటో బోల్తా

పర్లాకిమిడి గుసాని సమితి అడగాం జంక్షన్ వద్ద మంగళవారం ఉదయం ఆటో బోల్తాపడి ఐదుగురు విద్యార్థులకు గాయాలయ్యాయి.

- 8లో

న్యూస్‌రీల్

ప్రతిభ కనబర్చిన సత్య మహరణ



ప్రశంసాపత్రంతో సైకత శిల్పి సత్య మహరణ

బరంపురం: దేశ రాజధాని ఢిల్లీలో 4వ వరల్డ్ రికార్డ్స్ మీట్ మంగళవారం జరిగింది. దేశవ్యాప్తంగా సుమారు 100 మందికిపైగా చిత్రకారులు మీట్‌లో పాల్గొని తన ప్రతిభని ప్రదర్శించారు. ఈ పోటీల్లో బరంపురం నగరం భేజ్జిపూర్ నీలకంఠ నగర 3వ లైన్‌కు చెందిన సైకత శిల్పి సత్యనారాయణ మహరణ తన కళా నైపుణ్యంతో ప్రదర్శించిన చిత్రాలకు అరుదైనా గుర్తింపు గౌరవ పురస్కారం దక్కింది. ఈ నేపథ్యంలో ఆయనను పలువురు ప్రశంసించారు.

బాధ్యతల స్వీకరణ



సుమిత్ర పాత్రో

బరంపురం: గంజాం పోలీసుస్టేషన్ కొత్త ఐఐసీ అధికారిగా సుమిత్ర పాత్రో మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. అంతకు ముందు ఆమె కొందమాల్ జిల్లా పిరింగియా పోలీసుస్టేషన్ ఐఐసీ అధికారిగా విధులు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పోలీసుస్టేషన్ పరిధిలో శాంతిభద్రతలు సక్రమంగా ఉండేలా చర్యలు తీసుకోనున్నట్లు తెలియజేశారు.

చోరీ బైక్‌లు సీజ్.. ఇద్దరు అరెస్టు



అరెస్టైన నిందితులు

బరంపురం: స్థానిక జీఆర్పీ పోలీసు అధికారులు 9 చోరీ బైక్‌లు సీజ్‌చేసి, ఇద్దరు నిందితులను అరెస్టు చేసిన ఘటన నగరంలో సంచలనంగా మారింది. ఐఐసీ అధికారి బికాష్ కుమార్ పొలయి తెలిపిన వివరాల మేరకు.. బరంపురం జీఆర్పీ పోలీసులు బైక్‌ల దోపిడి ముఠాకి చెందిన ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. అరెస్టైనవారిలో ఖుర్దా జిల్లాకి చెందిన గొలమ్ హుసన్ ఖాన్, గంజాం జిల్లాకి చెందిన లిల్లు బెహరాలు ఉన్నట్లు వెల్లడించారు.

రాయగడలో భారీవర్షం



నగరంలో వర్షం కురుస్తున్న దృశ్యం

రాయగడ: నగరంలో మంగళవారం భారీ వర్షం కురిసింది. సుమారు గంటసేపు కురిసిన వర్షం కారణంగా లోతట్టు ప్రాంతాలు నీట మునిగాయి. స్థానిక రైతుల కాలనీ, మెయిన్ రోడ్డు తదితర ప్రాంతాల్లో మురికి కాలువల నీరు రోడ్డుపైకి వచ్చి దుర్గంధం వెదజల్లింది. జన జీవనం స్తంభించింది. వర్షంతో పంట పొలాల్లోకి నీరు చేరడంతో రైతులు ఆనందం వ్యక్తం చేశారు.

దివ్యాంగులకు ట్రైన్‌పాస్‌లు అందజేత



రైల్వే పాస్‌లతో దివ్యాంగులు

రాయగడ: జిల్లాలోని 51 మంది దివ్యాంగులకు ట్రైన్‌పాస్‌లు మంజూరయ్యాయి. మంగళవారం నిర్వహించిన ఒక ప్రత్యేక కార్యక్రమంలో ఈ పాస్‌లను వారికి రైల్వే సిబ్బంది అందజేశారు. కొద్దిరోజుల క్రితం దివ్యాంగుల ప్రయాణానికి పాస్‌లను మంజూరు చేయాలని జిల్లా దివ్యాంగుల సంఘం అధ్యక్షుడు రాకేష్ చంద్ర హిమిరిక, ఉపాధ్యక్షుడు సంతోష్ కుమార్ మహాపాత్రో, కార్యదర్శి జలందర్ బాటలిలు రైల్వే శాఖ అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు స్పందించిన రైల్వేశాఖ పాస్‌లను అందజేసింది. త్వరలో అర్హులైన మరింతమందికి పాస్‌లు అందేలా చర్యలు తీసుకుంటామన్నారు.

అధికార పార్టీలో.. అలజడి



సౌమ్య రంజన్ పట్నాయక్

- బీజేడీ ఉపాధ్యక్ష పదవి నుంచి సౌమ్య రంజన్ పట్నాయక్ తొలగింపు
- పార్టీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు
- పదవి అలంకారప్రాయమే: సౌమ్య రంజన్

భువనేశ్వర్: రాష్ట్ర ముఖ్యమంత్రి, బిజూ జనతాదళ్ (బీజేడీ) అధినేత నవీన్ పట్నాయక్ మంగళవారం పార్టీ సీనియర్ నేత సౌమ్య రంజన్ పట్నాయక్‌ను పార్టీ ఉపాధ్యక్ష పదవి నుంచి తొలగించినట్లు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వులు తక్షణమే అమల్లోకి వచ్చినట్లు స్పష్టం చేశారు. ఈ మేరకు నవీన్ పట్నాయక్ సంతకంతో బీజేడీ కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. అయితే ఈ ఉత్తర్వుల్లో అతనిని తొలగించడానికి ఎటువంటి కారణం వివరించకపోవడం గమనార్హం.

కొన్ని రోజులుగా విమర్శలు

గత రెండు నెలలుగా సౌమ్య రంజన్ పట్నాయక్ బీజేడీ కార్యకలాపాలను బహిరంగ సభలతో పాటు తన యాజమాన్యం, సంపాదకత్వంలో ముద్రితమై ప్రచురితమవుతున్న ప్రముఖ ఒడియా వార్తా పత్రికలో విమర్శించడం ఇక్కడ ప్రస్తావించదగినది. ఆయన మాటలు, చర్యలు ఈ సీనియర్ నాయకుడికి, పార్టీకి మధ్య దూరం పెంచాయి. ప్రత్యేకంగా ముఖ్యమంత్రి మరియు ఆయన వ్యక్తిగత కార్యదర్శి వి.కె.పాండియన్‌కు వ్యతిరేకంగా గళం విప్పి బాహాటంగా దుమారం రేపారు. అభివృద్ధి కార్యకలాపాలను సమీక్షించడానికి పాండియన్ వివిధ జిల్లాల సుడిగాలి పర్యటనలపై విమర్శలు గుప్పించారు. దీంతో ఈనెల 9న పరిశ్రమలు మరియు ఇంధన శాఖ మంత్రి ప్రతాప్ కేశరీ దేవ్ పార్టీ క్రమశిక్షణకు కట్టుబడి ఉండలేకపోతే బీజేడీ నుంచి వైదొలగాలని సౌమ్య రంజన్‌కు కోరారు. బీజేడీ ఎంపీ అమర్ పట్నాయక్ మీడియాతో మాట్లాడుతూ బీజేడీ సభ్యుడిగా ఉంటూ పార్టీని విమర్శించడం ఆమోదయోగ్యం కాదని హితవు పలికారు.

ఉల్లంఘన కాదు.. సంస్కరణ

బీజేడీ అగ్ర నేతల వ్యాఖ్యలపై స్పందించిన సౌమ్య రంజన్ తన వ్యవహారం పార్టీలోని గాడి తప్పుతున్న కార్యాచరణకు సంస్కరణే గానీ క్రమశిక్షణ ఉల్లంఘన కాదని బహిరంగంగా బదులు పలికారు. పార్టీని సంస్కరించేందుకు తాను చేస్తున్న ప్రయత్నాలను క్రమశిక్షణారాహిత్యం అనలేమని స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో ఆయన పత్రికలో సంపాదకీయం, ఎలక్ట్రానిక్ మీడియాకు బైట్లతో ముఖ్యమంత్రి 5టీ కార్యదర్శి వి.కె.పాండియన్‌కు ఉక్కిరిబిక్కిరి చేశారు.

సంతకం సందిగ్ధం

బిజూ జనతా దళ్ (బీజేడీ) ఉపాధ్యక్షుడి పదవి నుంచి తనను తొలగించడంపై కలవరపడని ఖండపడా నియోజకవర్గం ఎమ్మెల్యే సౌమ్య రంజన్ పట్నాయక్, మంగళవారం పార్టీ కార్యాలయం నుంచి జారీ అయిన ఉత్తర్వుల్లో బీజేడీ అధ్యక్షుడు నవీన్ పట్నాయక్ సంతకం వాస్తవికతపై ప్రశ్నలు లేవనెత్తారు. తనను ఉపాధ్యక్ష పదవి నుంచి తొలగించే కార్యాలయ ఉత్తర్వుల్లో ఉన్న నవీన్ పట్నాయక్ సంతకం అసలైనదా లేదా నకిలీదా అని అనుమానిస్తున్నట్లు మీడియాకు తెలిపారు. తాను ముఖ్యమంత్రిని కలవడానికి వారం రోజుల క్రితమే సమయం కోరానని, తనకు సమయం ఇవ్వలేదన్నారు. అయితే ఈరోజు తనను పదవి నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు జారీ కావడం సందిగ్ధతని ప్రేరేపిస్తుందన్నారు. సీఎం సంతకం నిజమో, నకిలీదో తేలాల్సి ఉందన్నారు. పార్టీ తీసుకున్న చర్యకు సంబంధించి, ఎవరు ఏ పదవిలో కొనసాగాలనేది నిర్ణయించుకోవడం ముఖ్యమంత్రిగా ఉన్న బీజేడీ అధ్యక్షుడి విచక్షణ మరియు అధికారమని అన్నారు. వ్యక్తులకు బాధ్యతలు అప్పగించడం మరియు వారిని సహచరులుగా ఎంచుకోవడం ఎల్లప్పుడూ పార్టీ అధ్యక్షుడి ప్రత్యేకాధికారమని నొక్కి ఒక్కాణించారు. తనను పార్టీ ఉపాధ్యక్షుడిగా నవీన్ నియమించారని పేర్కొన్న సౌమ్య, ఇప్పుడు పార్టీ చీఫ్ తనను పదవి నుండి తొలగించాలని నిర్ణయించుకున్నారని, ఇందులో అసాధారణంగా ఏమీ లేదని పేర్కొన్నారు. వ్యక్తిగతంగా, ఉపాధ్యక్ష పదవికి పెద్దగా ప్రాముఖ్యత లేనందున నేను ఏమీ కోల్పోయానని అనుకోనన్నారు. ఈ పదవి కేవలం అలంకారప్రాయమేనని పేర్కొన్నారు. హోదాలో పెద్ద పాత్ర ఏమీ కేటాయించబడలేదు, తొలగింపుతో ఒరిగేదేమీ లేదన్నారు.

భారీగా గంజాయి పట్టివేత



గంజాయితో పట్టుబడిన నిందితుడు

మల్కన్‌గిరి: జిల్లాలోని బలిమెల ఎక్సైజ్ పోలీసులు మంగళవారం బలిమెల కూడలి వద్ద పెట్రోలింగ్ నిర్వహిస్తున్న సమయంలో ఒక ఆటోలో తనిఖీలు నిర్వహించారు. ఆటోలో ఏమీ లేకపోవడంతో వదిలేయాలి అనుకున్నారు. కానీ అనుమానంతో కర్రతో ఆటోలో సీట్‌పై కొట్టగా గట్టిగా తగిలింది. దీంతో అనుమానంతో సీట్ కవర్‌ను చించి చూడగా అందులో 70 కేజీల గంజాయి ప్యాకెట్లు బయటపడ్డాయి. వెంటనే డ్రైవర్‌ను అరెస్టు చేసి, గంజాయి స్వాధీనం చేసుకున్నారు. డ్రైవర్‌ను విచారించగా మత్తిలి సమితికి చెందిన రామ్‌దాస్ భూమియాగా తెలిసింది. ఆయనను మల్కన్‌గిరి కోర్టుకు తరలించారు. పట్టుబడిన గంజాయి విలువ రూ.10 లక్షలు ఉంటుందని ఎక్సైజ్ ఎస్‌ఐ బింబాధర్ పండ తెలిపారు.

ఆందోళన విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న అధ్యక్షుడు రథ్

జయపురం: ఈనెల 15వ తేదీన దేశవ్యాప్తంగా నిర్వహించనున్న ఈపీఎఫ్ పెన్షన్‌దారుల ఆందోళనను విజయవంతం చేయాలని కొరాపుట్ జిల్లా ఈపీఎఫ్ పెన్షన్‌దారుల అసోసియేషన్ పిలుపునిచ్చింది. స్థానిక శ్రామిక భవనంలో కొరాపుట్ జిల్లా ఈపీఎఫ్ పెన్షనర్ల మహాసంఘం సమావేశాన్ని అధ్యక్షుడు నళినీ రథ్ అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈపీఎఫ్‌లో భాగంగా కనీసం నెలకు రూ.9 వేల పెన్షన్ అందజేయాలని కోరారు. వైద్య సౌకర్యాల కోసం మెడికల్ అలవెన్స్ సమకూర్చాలని ఏళ్లుగా కోరుతున్నా, పాలకులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అందువలన దేశవ్యాప్తంగా ఆందోళనలు తీవ్రతరం చేయనున్నట్లు వెల్లడించారు. ఆరోజు జయపురం ప్రధాన మార్గంలో సహిద్ లక్ష్మణ నాయిక్ విగ్రహం ఎదుట ధర్నా నిర్వహించాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. సమావేశంలో కార్మిక నేత ప్రమోద్ కుమార్ మహంతి, దండపాణి పాత్రో, ఎం.ఎస్.రావు, ఎస్.ఎస్.ఆర్.మూర్తి, ఉమాకాంత రథ్, కిశోర్ పండ, ఎస్.కె.బిశ్వాల్, ప్రదీప్ మహంతి తదితరులు పాల్గొన్నారు.

నకిలీ మద్యం ఫ్యాక్టరీపై దాడులు



అరెస్టు చేసిన వ్యక్తులను చూపిస్తున్న ఎక్సైజ్ అధికారులు



ఫ్యాక్టరీలో సీజ్ చేసిన సామగ్రి

బరంపురం: నగరంలో నకిలీ విదేశీ మద్యం మాఫియా ఆగడాలకు అడ్డుకట్ట వేసేందుకు బరంపురం ఎక్సైజ్ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. రాష్ట్ర ఎక్సైజ్ కమిషనర్ ఆశిష్ కుమార్ సింగ్ ఆదేశాలతో మంగళవారం మధ్యాహ్నం బరంపురం పోలీసు జిల్లా గొళంతరా పోలీసుస్టేషన్ పరిధి టమ్మనా–సియాలియా గ్రామాల మధ్య రహదారిలో నకిలీ విదేశీ మద్యం ఫ్యాక్టరీపై బరంపురం ఎక్సైజ్ అధికారులు దాడులు చేపట్టారు. దీనిలో భాగంగా భారీగా విదేశీ నకిలీ మద్యం సీజ్‌చేసి, నలుగురు నిందితులను అరెస్టు చేశారు. అలాగే వారి వద్ద నుంచి 40 లీటర్ల స్పిరిట్, 20 లీటర్లల నకిలీ మద్యం మిశ్రమ ద్రవం, 500 మద్యం బాటిళ్లు, 3 వేల కప్పులు మరియు 500 నకిలీ లేబుల్స్ స్వాధీనం చేసుకున్నారు. అరెస్టైనవారిలో హరడాఖంటికి చెందిన మున్నా నాయక్, సీతారామవీధికి చెందిన బుల్లు పాత్రో, జోగొబందు వీధికి చెందిన శనియా సాహు మరియు కోనిసి సంతకి చెందిన నిలు సాహులు ఉన్నట్లు ఎక్సైజ్ సూపరింటెండెంట్ సుబెద్ సెఠి వెల్లడించారు.

వంశధార నదిలో మునిగి యువకుడు మృతి



నాయక్ మృతదేహాన్ని బయటకు తెస్తున్న పోలీసులు

రాయగడ: వంశధార నదిలో స్నానానికి దిగిన ఒక యువకుడు ప్రమాదవశాత్తు మృతిచెందిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. జిల్లాలోని గుణుపూర్ సబ్ డివిజన్‌లోని గుడారి నిఘావాన్ వీధికి చెందిన కబుడి నాయక్ ఎప్పటిలాగే వంశధార నదిలో స్నానానికి వెళ్లాడు. అయితే అతడు ఎంతసేపటికీ ఇంటికి తిరిగి రాకపోవడంతో నది వద్దకు వెళ్లి కుటుంబ సభ్యులు వెతికారు. నది ఒడ్డున నాయక్ చెప్పులు, టవల్ ఉండడం గమనించి ప్రమాదం జరిగిందని వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. దీంతో సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు అగ్నిమాపక సిబ్బందికి తెలియజేశారు. నదిలో గాలించిన సిబ్బంది మూడు గంటల అనంతరం నాయక్ మృతదేహాన్ని వెలికితీశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గుడరి పీహెచ్‌సీకి తరలించారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

డెంగీ కేసులు పెరగడం లేదు

- పరిస్థితి స్థిరంగానే ఉంది
- ప్రజారోగ్య శాఖ డైరెక్టర్: నిరంజన్ మిశ్రా

భువనేశ్వర్: రాష్ట్రంలో డెంగీ పరిస్థితి స్థిరంగా కొనసాగుతోందని, కేసుల సంఖ్య పెరగలేదని ప్రజారోగ్య శాఖ డైరెక్టర్ డాక్టర్ నిరంజన్ మిశ్రా తెలిపారు. భువనేశ్వర్‌లో రోజుకు 80 నుంచి 100 డెంగీ కేసులు నమోదవుతుండగా, రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 200 కేసులు నమోదవుతున్నాయని పేర్కొన్నారు. ఈనెల 10న రాష్ట్ర వ్యాప్తంగా 68,620 నమూనాలను పరీక్షించగా, 5,097 డెంగీ పాజిటివ్‌గా తేలిందన్నారు. ఖుర్దా జిల్లాలో అత్యధికంగా 2,133 కేసులు నమోదయ్యాయని వెల్లడించారు. డెంగీ దోమలు ద్వారా ఒకరి నుంచి మరొకరికి వ్యాపిస్తుందని వివరించారు.

రాష్ట్రంలో స్క్రబ్ టైఫస్ కేసులు

బుర్లా విమ్సార్‌లో గత మూడు రోజుల్లో 22 స్క్రబ్ టైఫస్ కేసులు ఖరారు కావడంతో రాష్ట్రంలో అన్ని జిల్లా ప్రధాన ఆస్పత్రులలో బ్యాక్టీరియా ఇన్‌ఫెక్షన్‌కు సంబంధించిన పరీక్షల సౌకర్యం మరియు చికిత్స అందుబాటులో తీసుకొచ్చినట్లు మిశ్రా పేర్కొన్నారు. స్క్రబ్ టైఫస్ ఓరియంటియా సుత్సుగముషి అనే బ్యాక్టీరియా వల్ల వస్తుందన్నారు. ఇది సోకిన చిగ్గర్స్ కాటు ద్వారా ప్రజలకు వ్యాపిస్తుంది. తరచుగా వ్యవసాయ భూములు లేదా అడవుల్లో పనిచేసే వర్గాలకు ముఖ్యంగా రైతులు తరచుగా ఈ వ్యాధి బారినపడతారని వెల్లడించారు. స్క్రబ్ టైఫస్ యొక్క అత్యంత సాధారణ లక్షణం జ్వరం మరియు కాటు ప్రదేశంలో మార్పు చోటు చేసుకుంటుంది. దీని చికిత్స జిల్లా ప్రధాన ఆస్పత్రుల్లో అందుబాటులో ఉన్నందున భయపడాల్సిన అవసరం లేదన్నారు. జిల్లా ప్రజారోగ్య కేంద్రాల లేబొరేటరీలో అందుబాటులో ఉన్న ఎలిసా వ్యవస్థ ద్వారా స్క్రబ్ టైఫస్‌ను గుర్తించవచ్చని తెలిపారు. జ్వరం కొనసాగితే పీడితులకు స్క్రబ్ టైఫస్ పరీక్షలు నిర్వహించమని వైద్యులను కోరారు. వ్యాధిని సకాలంలో గుర్తిస్తే సమర్థవంతంగా చికిత్స చేయవచ్చన్నారు. ఈ రోగి చికిత్సలో యాంటీ బయాటిక్స్‌కు ప్రతిస్పందిస్తారని సూచించారు. చికిత్స జాప్యం, నిర్లక్ష్యం ప్రాణాంతక పరిణామాలను ప్రేరేపిస్తుందని హెచ్చరించారు. కెంజొహర్, బర్‌గడ్, నవరంగ్‌పూర్ మరియు సుందర్‌గడ్ జిల్లాల్లో ఇటువంటి కేసులు నమోదవుతున్నాయని పేర్కొన్నారు.

ముగ్గురు నిందితులు అరెస్టు



అరెస్టైన నిందితులు



నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న వస్తువులు

రాయగడ: పలు దొంగతనాలకు సంబంధించి గుణుపూర్ పోలీసులు ముగ్గురు వ్యక్తులను మంగళవారం అరెస్టు చేశారు. అరెస్టైనవారిలో గుణుపూర్ సబ్ డివిజన్ పరిధిలోని పడికాల్ గ్రామానికి చెందిన దిలీప్ సబర్ (25), ఉదయ్ సబర్ (19), నౌసా సబర్ (26)లు ఉన్నారు. జిల్లాలోని గుణుపూర్, పద్మపూర్, రామనగుడ పోలీసుస్టేషన్ల పరిధిలో కొద్ది నెలల క్రితం చోటుచేసుకున్న పలు దొంగతనాల కేసుల్లో వీరు నిందితులుగా ఉన్నారు. వీరి నుంచి 27 రకాల వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. ఇందులో ఒక కారు, హోండా మోటార్ బైకు, బజాజ్ పల్సర్ బైక్ వంటివి ఉన్నావి. నిందితులను కోర్టుకు తరలించారు.

ఘాట్ రోడ్డులో కలప ట్రక్కు బోల్తా



ఘాట్ రోడ్డుపై బోల్తాపడిన కలప ట్రక్కు

- డ్రైవర్, హెల్పర్‌కు తీవ్రగాయాలు



రోడ్డుపై పడివున్న కలప

జయపురం/మల్కన్‌గిరి: విజయవాడ–రాంచీ 326 జాతీయ కారిడార్ మార్గంలో బొయిపరిగుడ–గోవిందపల్లి మధ్య నీలగిరి కలప లోడుతో వెలుతున్న ట్రక్కు బోల్తాపడింది. సోమవారం రాత్రి సప్తగిరి నది వంతెనపై ఆ ట్రక్కు అదుపుతప్పి బోల్తాపడడంతో ఈ ప్రమాదం జరిగిందని తెలిసింది. అందువలన రోడ్డు బ్లాక్ అయింది. కారణంగా జాతీయ రహదారికి ఇరువైపులా వందలాది వాహనాలు నిలిచిపోయాయి. ప్రమాదంలో ట్రక్కు డ్రైవర్, హెల్పర్లు తీవ్రంగా గాయపడినట్లు సమాచారం. రోడ్డు బ్లాక్ అవ్వడంతో అటు మల్కన్‌గిరి, ఇటు కొరాపుట్ జిల్లాలకు రావాల్సిన అనేక వాహనాలతో పాటు ఛత్తీష్‌ఘడ్–ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు రాకపోకలు నిలిచిపోయాయి. మంగళవారం ఉదయం పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని బోల్తాపడిన ట్రక్కును తొలగించేందుకు యుద్ధ ప్రాతిపదిన చర్యలు చేపట్టారు. ఈ ట్రక్కు భద్రాచలం వెళ్తోందని తెలిసింది.

విద్యార్థిని అనుమానాస్పద మృతి



మరణించిన విద్యార్థిని తపస్విని



తపస్విని మృతదేహం వద్ద బందువులు



ఆస్పత్రి వద్ద గ్రామస్తులు

జయపురం: సమితిలోని కుమిలిపుట్ గ్రామ పంచాయతీ హోరడపుట్ ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల విద్యార్థిని అనుమానాస్పదంగా మృతి చెందింది. వివరాల్లోకి కోట్‌పాడ్ సమితి కుసిమి గ్రామ పంచాయతీ రావణగుడ గ్రామానికి చెందిన తపస్విని గదబ హోరడపుట్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతూ అక్కడే హాస్టల్‌లో ఉంటోంది. హాస్టల్‌లో ఉన్నటువంటి ముగ్గురు విద్యార్థినులు ఆదివారం అస్వస్థతకు లోనయ్యారు. ఆ విషయం తెలిసిన పాఠశాల వర్గాలు వారిని రామగుడ ఆస్పత్రిలో చేర్చారు. తపస్వినికి గ్యాస్టిక్ సమస్య ఉందని చెప్పి, మందులు ఇచ్చి పంపారు. మందులతో హాస్టల్‌కు చేరుకున్న విద్యార్థినులు వాటిని వేసుకుని రాత్రి పడుకున్నారు. సోమవారం ఉదయానికి ఇద్దరి విద్యార్థినుల ఆరోగ్యం కుదుటపడింది. కానీ తపస్విని ఆరోగ్య పరిస్థితి మాత్రం విషమంగా మారింది. ఆమె అచేతనంగా పడిపోయింది. ఆ స్థితిలో ఉన్న తపస్వినిని స్కూల్ ఉపాధ్యాయులు మరోసారి రామనగుడ ఆస్పత్రిలో చేర్చారు. విద్యార్థిని ఆరోగ్యం బాగులేదని ఆమె తల్లిదండ్రులకు పాఠశాల వర్గాలు తెలియజేశారు. సమాచారం అందిన వెంటనే ఆమె తల్లిదండ్రులు బంధువులు, కొందరు గ్రామస్తులు ఆస్పత్రికి చేరుకున్నారు. అయితే అప్పటికే విద్యార్థిని మరణించింది. డాక్టర్లు, స్కూల్ ఉపాధ్యాయుల నిర్లక్ష్యం వలనే తన కుమార్తె మరణించిందని విద్యార్థిని తండ్రి కృష్ణ గదబ ఆరోపించారు. తన బిడ్డ ఆరోగ్యం బాగాలేక పోయినా తమకు తెలియజేయలేదని మండిపడ్డాడు. తమకు ముందే సమాచారం ఇచ్చుంటే నాణ్యమైన వైద్యం అందించేవారమని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ఈ ఘటనపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశాడు. అనంతరం బొరిగుమ్మ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అయితే విద్యార్థిని వైద్యంపై ఎటువంటి నిర్లక్ష్యం జరుగలేదని, సకాలంలోనే ఆమెను ఆస్పత్రికి తీసుకెళ్లామని హెచ్‌ఎం కవిత దొళాయి వెల్లడించారు.

క్లుప్తంగా

అయోధ్య టు శ్రీలంక

● కాలి నడకన యువకుడి ప్రయాణం



పాదయాత్ర చేస్తున్న సమరేంద్ర సింగ్ రాథోడ్

మల్కన్‌గిరి: అయోధ్యలోని బలియా గ్రామానికి చెందిన సమరేంద్ర సింగ్ రాథోడ్ అనే యువకుడు శ్రీలంక వరకు కాలి నడకన ప్రయాణిస్తూ రామాయణంలోని ప్రధాన ఘట్టాలకు సంబంధించిన ప్రసిద్ధ ప్రదేశాలు సందర్శించాలని సంకల్పించాడు. దీనిలో భాగంగా అతడు ఆదివారం రాత్రి జిల్లాలోని మత్తిలి సమితి కేంద్రానికి చేరుకున్నారు. ఆయోధ్య నుంచి ఇప్పటివరకు 4,000 కి.మీ నడిచానని, ఇంకో 15,000 కి.మీ నడుస్తానని తెలియజేశాడు. అనంతరం సోమవారం ఉదయం బోండఘట్టీలో ఉన్న అమ్మకూండ ప్రాంతంలో సీతారాములు వనవాసం చేసిన ప్రాంతాన్ని దర్శించాడు. ఆ తర్వాత అక్కడ నుంచి పయనమయ్యాడు.

చట్టపరమైన చర్యలు తీసుకోవాలి



సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న విశ్వహిందూ పరిషత్ నాయకులు

జయపురం: సనాతన ధర్మంపై అనుచిత వ్యాఖ్యలు చేసిన తమిళనాడు మంత్రి ఉదయ నిధి స్టాలిన్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని విశ్వహిందూ పరిషత్ కోరింది. ఈ మేరకు గవర్నర్‌ను ఉద్దేశిస్తూ సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం మంగళవారం అందజేశారు. ఆయన వ్యాఖ్యలు హిందూ సమాజాన్ని అగౌరవ పరిచేలా ఉన్నాయన్నారు. వినతిపత్రం అందించినవారిలో విశ్వహిందూ పరిషత్ పట్టణ పరిచాలకులు బాబూ షాడంగి, నవకృష్ణ రథ్ తదితరులు ఉన్నారు.

మిషన్ ఇంద్రధనుష్ ప్రారంభం

మల్కన్‌గిరి: జిల్లాలోని మల్కన్‌గిరి సమితి ఎంవీ 43 గ్రామం వద్దనున్న అంగన్‌వాడీ కేంద్రంలో మిషన్ ఇంద్రధనుష్ కార్యక్రమాన్ని జిల్లా వైద్యాధికారి ప్రఫుల్ల కుమార్ నాందో సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో భాగంగా పిల్లలు పుట్టినప్పటి నుంచి 5 సంవత్సరాల వరకు ఏఏ టీకాలు వేయాలో అంగన్‌వాడీ సిబ్బందికి ముందుగానే శిక్షణ ఇవ్వడం జరుగుతుంది. ఈ నేపథ్యంలో తొలిరోజు జిల్లా వైద్యాధికారి స్వయంగా నలుగురు పిల్లలకు టీకాలు వేశారు. ఈనెల 16వ తేదీ వరకు టీకాలు వేయనున్నట్లు పేర్కొన్నారు. దీనిలో భాగంగా 445 మంది గర్భిణులు, 1733 మంది చిన్నారులకు టీకాలు వేయడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు. సకాలంలో పిల్లలకు టీకాలు వేయడం వలన ఆరోగ్యవంతంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో జిల్లా సాంఘిక సంక్షేమాధికారి ఇందిరా ప్రధాన్, జిల్లా అదనపు ఆరోగ్య అధికారి బోజాబాంద్ దాస్, ధనేశ్వర్ మహాపాత్రో తదితరులు పాల్గొన్నారు.

నూతన విద్యా విధానంపై సూచనలకు ఆహ్వానం

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో నూతన విద్యా విధానం అమలుకు సూచనలు ఆహ్వానిస్తున్నట్లు వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ నిమ్మ వెంకటరావు తెలిపారు. విద్యా విభాగం ఆధ్వర్యంలో అక్టోబర్ 4, 5 తేదీల్లో నూతన విద్యా విధానం -2020 అమలు, సవాళ్లు, ప్రయోజనాలు అంశంపై సదస్సు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ మేరకు వర్సిటీలో మంగళవారం సెమినార్ బ్రోచర్లు ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో నైపుణ్యాల కల్పన, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లక్ష్యంగా నూతన విద్యా విధానానికి కేంద్ర విద్యా మంత్రిత్వశాఖ శ్రీకారం చుట్టినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ సీహెచ్ఏ రాజేంద్రప్రసాద్, ప్రిన్సిపాళ్లు ప్రొఫెసర్ బిడ్డిక అడ్డయ్య, ప్రొఫెసర్ చింతాడ రాజశేఖర్‌రావు, డాక్టర్ ఎస్.ఉదయ్ భాస్కర్, సెమినార్ కన్వీనర్ డాక్టర్ హనుమంతు సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

ఆదిత్యుని సన్నిధిలో మహా రుద్రాభిషేకం

అరసవల్లి: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అరసవల్లి సూర్యనారాయణ స్వామి సన్నిధిలో మంగళవారం ఏకాదశ పార్థివ మహాలింగ రుద్రాభిషేకం ఘనంగా పూర్తయ్యింది. ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో శ్రావణ మంగళవారాన శాస్త్రోక్తంగా ఈ అభిషేక ప్రక్రియ నిర్వహించగా భక్తులు హాజరై దేవదేవుని ఆశీస్సుల కోసం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనివేటి మండపంలోని 11 మండపాల్లో వేదమంత్రోచ్చారణల మధ్య కార్యక్రమం జరిపించారు. లోకకల్యాణార్థం ఈ అభిషేకం నిర్వహించినట్లు ప్రధానార్చకులు శంకరశర్మ తెలిపారు. కార్యక్రమంలో ఆలయ పాలకమండలి సభ్యులు మండవిల్లి రవి, ద్వారపు అనూరాధ, మైలపల్లి లక్ష్మి, జోగి మల్లెమ్మ, సీనియర్ అసిస్టెంట్ కృష్ణమాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

ఆందోళన కొనసాగిస్తాం

● స్పష్టం చేసిన ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయుల సంఘం



ఆందోళన చేస్తున్న ఉపాధ్యాయులు

భువనేశ్వర్: తమ డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ చేస్తున్న రాష్ట్రస్థాయి ఆందోళన కొనసాగిస్తామని ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయుల సంఘం స్పష్టం చేసింది. డిమాండ్ల పరిశీలనకు ప్రభుత్వం చర్యలు చేపడుతుందని, ఆందోళన విరమించాలని రాష్ట్ర ప్రభుత్వం చేసిన విజ్ఞప్తిపై ఆందోళనకారుల వర్గం ఇలా స్పందించింది. ప్రభుత్వ విజ్ఞప్తి మేరకు మంగళవారం జరిగిన ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుల సంఘం స్టీరింగ్ కమిటీ సమావేశంలో ఆందోళన నిరవధికంగా కొనసాగించాల్సిందేనని నిర్ణయించారు.

ఉపాధ్యాయుల రాష్ట్రస్థాయి ఆందోళనల కారణంగా రాష్ట్రంలోని దాదాపు 10,000 ప్రాథమిక, ఉన్నత ప్రాథమిక పాఠశాలల్లో విద్యాబోధన విపరీతంగా ప్రభావితం అవుతోంది. విద్యార్థుల చదువులు దెబ్బతింటున్నాయని ప్రభుత్వం సూచించింది. ఈనెల 8వ తేదీ నుంచి సామూహిక సెలవులో ఉన్న ఉపాధ్యాయులు ఆందోళన కొనసాగిస్తున్నారు. వీరితో ప్రభుత్వం సోమవారం జరిపిన చర్చలు సంతృప్తికరమైన ఫలితాలు ఇవ్వకపోవడంతో తమ ఆందోళనను కొనసాగించాలని నిర్ణయించినట్లు వివరించారు.

సబ్ కమిటీ ఏర్పాటు

ఆందోళనకు దిగిన ఉపాధ్యాయుల డిమాండ్ల పరిష్కారానికి ప్రభుత్వం నడుం బిగించింది. ఈ నేపథ్యంలో వారి డిమాండ్లను సమీక్షించడానికి 5 మంది సభ్యులతో కూడిన సబ్ కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపింది. డిమాండ్లను పరిశీలించిన మేరకు ఈ కమిటీ తన నివేదికను ఇంటర్ మినిస్ట్రీరియల్ కమిటీకి సమర్పిస్తుంది. ఆ తర్వాత ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకుంటుంది. ఈ నేపథ్యంలో ఆందోళన విరమించి ఉపాధ్యాయులు విధులకు యథాతథంగా హాజరు కావాలని ప్రభుత్వం అభ్యర్థించింది.

ఉపాధ్యాయుల డిమాండ్లు

ఉపాధ్యాయులు తమ ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని, ఆర్ట్, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ల విషయంలో కెరీర్ అడ్వాన్స్‌మెంట్ విధానాన్ని అమలు చేయాలని, మాస్ ఎడ్యుకేషన్ టీచర్ల మాజీ క్యాడర్ రద్దు వంటి డిమాండ్లతో ఆందోళన చేస్తున్నారు.

రామ మందిరం నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజలో పాల్గొన్న బీజేడీ నాయకులు

పర్లాకిమిడి: గుసాని సమితి అంకుడు గ్రామంలో నూతన రామ మందిరం నిర్మాణానికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.10 లక్షల మంజూరయ్యాయి. దీంతో గ్రామంలో మందిరం నిర్మాణానికి మంగళవారం భూమిపూజ చేశారు.

కార్యక్రమంలో జిల్లా పరిషత్ అధ్యక్షుడు గవర తిరుపతిరావు, బీజేడీ నాయకుడు తిరుపతి పాణిగ్రాహి, యువనేత రూపేష్ పాణిగ్రాహి, గుసాని సమితి అధ్యక్షుడు ఎస్.వీరాజు, ఆర్ఎంసీఎస్ అధ్యక్షుడు ఎస్.గజపతిరావు, జిల్లా పరిషత్ సభ్యులు ఎస్.బాలరాజు, జి.విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆటో బోల్తా

● ఐదుగురు విద్యార్థులకు గాయాలు



అడగాం పొలాల్లో బోల్తా పడిన ఉన్న ఆటో

పర్లాకిమిడి: గుసాని సమితి అడగాం జంక్షన్ వద్ద మంగళవారం ఉదయం ఆటో బోల్తాపడి ఐదుగురు విద్యార్థులకు గాయాలయ్యాయి. పాటికోట గ్రామం నుంచి లింగుపూర్ ఆదర్శ విద్యాలయానికి వెళ్తున్న ఆటోకు కుక్క అడ్డంగా రావడంతో దానిని తప్పించడం కోసం చూడగా, పొలాల్లోకి ఆటో దూసుకుపోయింది. దీంతో ఆటోలో ఉన్న ఐదుగురు విద్యార్థులతో పాటు డ్రైవర్‌కి గాయాలయ్యాయి. వీరికి గురండి సామాజిక స్వాస్థ్య కేంద్రంలో ప్రాథమిక చికిత్స అందించి, అనంతరం పర్లాకిమిడి ప్రభుత్వ హెడ్‌క్వార్టర్ మెడికల్‌కు తరలించారు. ప్రస్తుతం విద్యార్థులు పర్లాకిమిడి మెడికల్‌లో చికిత్స పొందుతున్నారు. దీనిపై గురండి పీఎస్‌లో కేసు నమోదయ్యింది.

చిట్టి గుండెకు శ్రీరామరక్ష

● పిల్లల హృదయాలకు ప్రభుత్వ రక్షణ
● టీటీడీ ఆధ్వర్యంలో 15 ఏళ్ల లోపు పిల్లలకు గుండె పరీక్షలు నేడు
● రిమ్స్ ఆస్పత్రిలో 27వ నంబర్ గదిలో పరీక్ష శిబిరం ఏర్పాటు
● నిర్ధారణ పూర్తయ్యాక తిరుపతి పద్మావతి ఆస్పత్రిలో చికిత్స
● డిసెంబర్‌లో పెద్దలకు గుండె పరీక్షల శిబిరం



శ్రీకాకుళం: జిల్లాలో 15 ఏళ్ల లోపు చిన్నారులకు బుధవారం గుండె పరీక్షలు నిర్వహించనున్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో నడుస్తున్న శ్రీపద్మావతి పిల్లల గుండె ఆస్పత్రితో పాటు జిల్లా ఎర్లీ ఇంటర్‌వేషన్ సెంటర్, నేషనల్ హెల్త్ మిషన్, రాష్ట్రీయ బాల సురక్ష సంయుక్తంగా ఈ పరీక్ష శిబిరం నిర్వహిస్తున్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఈ పరీక్షలు చేపట్టగా బుధవారం శ్రీకాకుళం జిల్లాకు సంబంధించిన చిన్నారులను రిమ్స్ వైద్య కళాశాలకు అనుబంధంగా ఉన్న ఆస్పత్రిలో 27వ నంబర్ గదిలో గుండె పరీక్షలు నిర్వహించనున్నారు. పద్మావతి చిల్డ్రన్ హార్ట్ సెంటర్‌కు చెందిన చిన్న పిల్లల గుండె వైద్య నిపుణులు డాక్టర్ ఎస్.శ్రీనాథ్ రెడ్డి, డాక్టర్ హృదయ్ చంద్ర, డాక్టర్ పద్మావతిలు ఈ పరీక్షలు నిర్వహిస్తారు. శ్రీకాకుళం జిల్లాకు చెందిన డాక్టర్ సి.పి.శ్రీదేవి కార్యక్రమానికి కోఆర్డినేటర్‌గా వ్యవహరిస్తున్నారు. 2డీ ఎకో స్కాన్ ద్వారా చిన్నారుల గుండెలో లోపాలు గుర్తిస్తారు. అనంతరం తిరుపతిలోని పద్మావతి చిల్డ్రన్ హార్ట్ కేంద్రానికి పిల్లలను తరలించి ఎస్వీ ప్రాణదాన ట్రస్టు, టీటీడీ ఆధ్వర్యంలో ఉచితంగా వైద్యాన్ని అందిస్తారు. అవసరమైన వారికి శస్త్ర చికిత్సలు నిర్వహిస్తారు.

డిసెంబర్‌లో పెద్దలకు..

రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించిన విషయం విదితమే. ఇందులో భాగంగా పెద్దల్లో గుండెపోటు మరణాలు తగ్గించేందుకు ప్రత్యేక కార్యక్రమం రూపొందించారు. దీనిని పైలట్ ప్రాజెక్టుగా తిరుపతిలో నిర్వహించగా ఈ నెలలో గుంటూరు, విశాఖపట్నం, కర్నూలులో ప్రారంభించారు. ఆయా జిల్లాల్లో విజయవంతమైతే రాష్ట్ర వ్యాప్తంగా విస్తరించేందుకు నిర్ణయం తీసుకున్నారు. కరోనా తర్వాత అనేక చోట్ల గుండె సంబంధిత వ్యాధితో మృతి చెందుతున్న వారి సంఖ్య పెరగటంతో ప్రభుత్వం ఈ చర్యలు చేపట్టింది. గుండెపోటుకు గురైన వారికి గోల్డెన్ హవర్‌గా చెప్పుకునే మొదటి గంటలో చికిత్స అందేలా కార్యక్రమాన్ని రూపొందించారు. హార్ట్ ఎటాక్ వచ్చిన సమయంలో ప్రాణ రక్షగా భావించే రూ.40వేలు విలువైన థ్రాంబోలైసిస్ అనే ఇన్‌జంక్షన్‌తో రోగి ప్రాణాన్ని కాపాడేలా చర్యలు చేపట్టారు. డిసెంబర్‌లోగా ఈ కార్యక్రమం అమలయ్యే అవకాశం ఉంది.

వినియోగించుకోవాలి..



15 ఏళ్ల లోపు పిల్లలకు గుండె సంబంధిత సమస్యలు ఉన్నా, ఆయాసం, అధిక చెమటలు పట్టడం వంటి లక్షణాలు ఉన్నా ఈ శిబిరానికి వచ్చి పరీక్షలు చేయించుకోవాలి. అత్యంత ఖరీదైన వైద్యాన్ని టీటీడీ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా అందిస్తుంది. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి,.

– డాక్టర్ సి.పి.శ్రీదేవి, ప్రోగ్రాం కో-ఆర్డినేటర్

అదరహో..!

● ఉల్లాసంగా యుజనోత్సవాలు
● జిల్లా నలుమూలల నుంచి హాజరైన యువత
● పోటీలతోనే సృజనాత్మకత: జేసీ ఎం.నవీన్



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న జేసీ నవీన్



డ్యాన్స్ చేస్తున్న విద్యార్థినులు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాస్థాయి యువజన ఉత్సవాలు ఆద్యంతం ఉల్లాసంగా, ఉత్సాహంగా సాగాయి. యూత్ ఫెస్టివల్ వేడుకల్లో యువతీ యువకులు వివిధ నృత్యప్రదర్శనలను ప్రదర్శించి ఆకట్టుకున్నారు. తమలోని ప్రతిభను ప్రదర్శిస్తూ ఆహూతులను మంత్రముగ్ధులను చేశారు. ఇందుకు శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల సెమినార్ హాల్ వేదికగా నిలిచింది. విజేతలుగా నిలిచిన వారు గుంటూరులో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రాతినిధ్యం వహించనున్నారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ మాట్లాడుతూ యువత, విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు యువజనోత్సవాలు ఎంతగానో దోహదపడతాయన్నారు. స్వామి వివేకనంద జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. సెట్‌శ్రీ సీఈవో బి.వి.ప్రసాదరావు మాట్లాడుతూ యూత్ ఫెస్టివల్ విధివిధానాలు వివరించారు. కార్యక్రమంలో స్థానిక మహిళా కళాశాల ప్రిన్సిపాల్ కె.సూర్యచంద్రరావు, మెప్మా పీడీ కిరణ్‌కుమార్, వయోజన విద్య ఉపసంచాలకులు ఎం.వెంకటరమణ, జిల్లా ఉపాధి కల్పనాధికారి కొత్తలంక సుధా, ఇంటెక్ సభ్యులు రాధాప్రసాద్, యూత్ కోఆర్డినేటర్ కె.వెంకట్ ఉజ్వల్, చీఫ్ కోచ్ కె.శ్రీధర్‌రావు, జిల్లా పర్యాటకాధికారి ఎస్.నారాయణరావు, సెట్‌శ్రీ అప్పలనాయుడు, సహాయ మేనేజర్ కె.వి.రమణ తదితరులు పాల్గొన్నారు.

భద్రతకు భరోసా దిశ






● 2023 మార్చి 4న వజ్రపుకొత్తూరు మండలం హుకుంపేటకు చెందిన 21 ఏళ్ల యువతిని మద్యం తాగిన వ్యక్తి ఈవ్‌టీజింగ్ చేస్తున్నాడంటూ యువతి బావ ఉదయం 10:26కు ఎస్ఓఎస్ బటన్ నొక్కి ఫిర్యాదు చేశారు.
10:28 గంటలకు పీఎస్ నుంచి ఫోన్ వచ్చింది. ఏడెనిమిది నిమిషాల్లో సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకున్నారు. స్టేషన్‌కు నిందితున్ని తీసుకెళ్లి ఎఫ్ఐఆర్ నమోదు చేశారు.

● 2023 మే 23న శ్రీకాకుళం నగరంలోని కాకివీధికి చెందిన 22 ఏళ్ల యువతిని ఓ వ్యక్తి వేధిస్తూ పొందూరు రాపాక జంక్షన్ వద్ద ఫాలో చేస్తున్నాడని సాయంత్రం 5:21కు దిశాయాప్ ద్వారా ఫిర్యాదు చేసింది. 5:25గంటలకు కుపొందూరు పీఎస్ ఏఎస్ఐకు సమాచారం అందితనతో పాటు హెచ్‌సీ, పీసీలు స్పాట్‌కు వెళ్లి నిందితుడ్ని స్టేషన్‌కు తీసుకొచ్చారు. సాయంత్రం 6:00 గంటలకల్లా కేసు నమోదు చేశారు.

● 2023 ఏప్రిల్ 29న సంతబొమ్మాళి మండలంలో ఉంటున్న 25 ఏళ్ల వివాహిత తన కుమార్తెతో కలిసి కన్నవారి ఊరైన పాతపట్నం నుంచి ఇంటికి తిరిగివస్తుండగా అదృశ్యమైనట్లు 9:00 గంటలకు సంతబొమ్మాళి పీఎస్‌కు ఫిర్యాదు అందగా ఎఫ్ఐఆర్ నమోదైంది. 15 రోజుల్లో పోలీసులు ట్రేస్ చేసి బెంగళూర్‌లో ఉన్నట్లు గుర్తించారు.



● మగువల రక్షణలో సత్ఫలితాన్నిస్తున్న దిశ చట్టం
● లైంగిక నేరగాళ్ల హడల్
● జిల్లాలో దిశ యాప్ డౌన్‌లోడ్లు 11,13,167
● ఐదు దిశా జీట్ వాహనాలు, 48 టూవీలర్లతో నిత్యం నిఘా

శ్రీకాకుళం క్రైమ్: మహిళల భద్రతకు పెద్దపీట వేస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2020 మార్చి 3న అమల్లోకి తీసుకొచ్చిన దిశ చట్టం మగువలకు శ్రీరామరక్షగా నిలుస్తోంది. స్త్రీల పట్ల నేరాలకు పాల్పడే వారిని కటకటలా వెనక్కి పంపిస్తోంది. ఈ చట్టం ప్రారంభమైనప్పటి నుంచి జిల్లాలో పోక్సో యాక్ట్ ప్రకారం 54 కేసులు నమోదు కాగా రెండు మినహా అన్నీ విచారణ పూర్తి చేసుకుని న్యాయస్థానాల్లో ఉన్నాయి. మూడు నేరారోపణ రుజువై నలుగురు ముద్దాయిలకు శిక్ష కూడా పడింది. దిశా చట్టంపై నమ్మకం పెరిగి భర్తల వేధింపులకు తాళలేని భార్యలు ధైర్యంగా పోలీస్‌స్టేషన్ మెట్లెక్కి ఫిర్యాదు చేస్తున్నారు. ఈవ్‌టీజింగ్‌లు, ర్యాగింగ్‌ల బారిన పడే విద్యార్థినులు సైతం దిశా యాప్‌లో ఫిర్యాదు చేసి రక్షణ పొందుతున్నారు.

సకాలంలో స్పందన..

● దిశ యాప్ డౌన్‌లోడ్ చేసి పూర్తిస్థాయిలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి.
● మగువలు ప్రమాదానికి గురైనప్పుడు అందులోని ఎస్ఓఎస్ బటన్ క్లిక్ చేస్తే నేరుగా విజయవాడ కంట్రోల్‌రూమ్‌కు వెళ్లి అక్కడి నుంచి జీపీఎస్ ద్వారా ఘటనాస్థలిని గుర్తించి సంబంధిత పీఎస్‌కు, జిల్లా కంట్రోల్‌రూమ్ సమాచారం అందుతుంది.
● ఇదంతా రెండు నిమిషాల్లో జరుగుతుంది.
● ప్రమాదస్థలికి వెంటనే పోలీసులు చేరుకుంటారు.
● ఈ ప్రక్రియ మొత్తం పది నిమిషాల్లో పూర్తవుతుంది.

సంవత్సరం	భార్యాభర్తలు ఫిర్యాదులు	ఎఫ్ఐఆర్ నమోదైనవి
2020	531	67
2021	754	71
2022	1002	114
2023	682	72

దిశా బీట్లు..

జిల్లావ్యాప్తంగా ముఖ్య నేరప్రాంతాలు, విద్యాసంస్థల సముదాయం, బస్‌కాంప్లెక్సులు, పవిత్ర దినాల్లో దేవాలయాల పరిసర ప్రాంతాల్లో దిశా బీట్ వాహనాలు నిత్యం గస్తీ కాస్తుంటాయి. దిశా పెట్రోలింగ్ కార్లు (ఇచ్ఛాపురం, కాశీబుగ్గ, టెక్కలి, ఆమదాలవలస, శ్రీకాకుళం పీఎస్‌ల పరిధి ఒక్కోటి, డీఎస్పీకి ఒకటి) జిల్లాలో ఆరు ఉండగా టూవీలర్లు 48 (మన్యం, విజయనగరం జిల్లాలకు చెందిన సీతంపేట, హిరమండలం, రాజాం, వీరఘట్టంలతో కలిపి) ఉన్నాయి.

దిశయాప్ డౌన్‌లోడ్	టెటిఅవర్ డేటా (ఎగ్జాక్ట్ రిజిస్ట్రేషన్)	ఎస్ఓఎస్ కాల్స్	టెస్ట్ కాల్స్	ఎసైన్డ్ కాల్స్	ఎఫ్ఐఆర్ అయినవి
11,13,167	3,09,055	28,598	27,828	770	71

నేరారోపణ రుజువైనవి..

● 2021 జలుమూరు మండలం (గుగ్గిలి పంచాయితీ గుండువలస గ్రామం)లో మూత్రవిసర్జన చేయడానికి వీధి చివరకు వెళ్లిన బాలికను అదే గ్రామానికి చెందిన కూర్మాన సింహాచలం నిర్మాణంలో ఉన్న భవనం వద్దకు బలవంతంగా తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాలిక తల్లిదండ్రులు ఫిర్యాదు చేయడంతో పోక్సో యాక్ట్ కింద కేసు నమోదైంది. దిశా డీఎస్పీ ఎస్.వాసుదేవరావు దర్యాప్తు చేపట్టి నిందితున్ని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. నేరం రుజువు కావడంతో ఈ ఏడాది ఆగస్టు 22న ముద్దాయికి 20 ఏళ్ల జైలు శిక్ష, రూ. 60 వేలు జరిమానా విధించారు.

● 2020 డిసెంబరులో జి.సిగడాం మండలం భీమవరం గ్రామానికి చెందిన బాలికపై అదే గ్రామానికి చెందిన లుట్ట అనిల్‌కుమార్, పమోటి రవికుమార్‌లు లైంగిక దాడికి పాల్పడ్డారు. బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు దిశా డీఎస్పీ దర్యాప్తు చేయగా ప్రభుత్వ న్యాయవాది పి.వెంకటరమణారావు శ్రీకాకుళం ప్రత్యేక ట్రిబ్యునల్ కోర్టులో వాదనలు జరిపారు. ముద్దాయిలిద్దరికీ 20 ఏళ్లు చొప్పున జైలు, జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

● 2021 జూలైలో కాశీబుగ్గలో ఓ బాలికపై కాశీబుగ్గకే చెందిన పొందర గోపీ బెహరా లైంగిక దాడి చేయడంతో కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. 2022 మే 10న ముద్దాయికి ఐదేళ్ల జైలుశిక్ష, రూ.500 జరిమానా విధిస్తూ కోర్టు తీర్పిచ్చింది.



శ్రీకాకుళం మహిళా డిగ్రీ కళాశాలలో దిశా యాప్‌పై అవగాహన

నేరస్తుల్లో భయాందోళన..



పోక్సో యాక్ట్ కేసులు, లైంగిక దాడులకు శిక్షా కాలం పెరగడంతో భయాందోళనకు లోనై బాధితులనే వివాహం చేసుకుంటున్నారు. ఇలాంటివి నా పరిధిలో హైకోర్టు వరకు వెళ్లి మరీ రాజీ పడి వివాహం చేసుకుని చక్కగా బతుకుతున్నారు. భర్తతో వేధింపులకు గురైన మహిళలు ధైర్యంగా స్టేషన్‌కొచ్చి ఫిర్యాదు చేస్తున్నారు. ఇది ఓ రకంగా మంచి మార్పు. కళాశాలలు, స్కూళ్లలోనూ నిత్యం నిఘా పెట్టి ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్ పాల్పడినవారిపై చర్యలు తీసుకుంటున్నాం. దిశా చట్టం పెట్టాక త్వరితగతిన విచారణ జరిగి ఎస్పీ స్వీయ పరిశీలనలో కోర్టులో ట్రయల్ వేగవంతమై, కన్విక్షన్ రేటు పెరిగి బాధిత మహిళలకు తక్షణ న్యాయం జరుగుతోంది.

– ఎస్.వాసుదేవరావు, దిశా డీఎస్పీ

కౌన్సిలింగ్ చేస్తారిలా..

● భార్యాభర్తలు తగాదా పడి స్టేషన్‌కొచ్చిన సందర్భంలో ఎనిమిది మందితో (న్యాయవాదులు, డీఆర్‌డీఏ, రిటైర్డు సీనియర్ సిటిజన్లు ఇద్దరేసి చొప్పున, ఒక రిటైర్డు ఎస్ఐ, ఒక ఐసీడీఎస్ అధికారి) కూడిన దిశా కౌన్సిలింగ్ బృందం వారికి పది, 15 రోజుల్లో మూడు కౌన్సిలింగ్‌లు ఇస్తారు.
● అప్పటికీ మారకపోతే నెల తర్వాత అబ్జర్వేషన్‌లో ఉంచి రిపీటెడ్ కౌన్సిలింగ్‌కు పిలుస్తారు. అయినప్పటికీ విడిపోవడానికే నిర్ణయిస్తే.. ఎఫ్ఐఆర్ వేస్తారు.
● దిశా ప్రారంభమైన నాటి నుంచి ఇప్పటి వరకు 2969 ఫిర్యాదుల్లో 371 ఎఫ్ఐఆర్‌లు వేశారు. 2598 మంది భార్యాభర్తలను కలిపారు.



ఉమెన్ డిగ్నిటీ డే..

రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ ఆదేశాలతో ప్రతి శుక్రవారం అన్ని పీఎస్‌ల పరిధిలో మహిళల గౌరవ దినం చేయాలని డీజీపీ కార్యాలయం నుంచి ఈ ఏడాది జూలై 7న ఉత్తర్వులు రావడంతో దిశా ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వర్తిస్తున్నారు.

క్లుప్తంగా

చోరీకేసులో నిందితుడికి ఏడాది జైలు

సీతానగరం: మండలంలోని జానుమల్లువలస లో చోరీ చేసినట్లు రుజువు కావడంతో ముద్దాయికి 1 సంవత్సరం జైలు శిక్ష, రూ 2 వేలు జరిమానా విధిస్తూ బొబ్బిలి జూనియర్ సివిల్ జడ్జి కోర్టు తీర్పు వెలువరించినట్లు ఎస్సై కె.నీలకంఠం మంగళవారం తెలియ జేశారు. జానుమల్లువలస గ్రామానికి చెందిన యాళ్ల నారాయణరావు ఇంట్లోని బీరువాలో 48 గ్రాముల రెండు పేటల పుస్తెల తాడు ఎవరో దొంగలించారని 2021 అక్టోబర్‌లో ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్సై బి.మురళి కేసు నమోదు చేశారు. తదుపరి ఎస్సై నీలకంఠం ఈ కేసును దర్యాప్తు చేసి 2022లో గ్రామానికి చెందిన చుక్క శ్రీనివాసరావు అలియాస్ తిరుపతిరావును అరెస్ట్ చేసి 48 గ్రాముల రెండుపేటల పుస్తెల తాడును స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. కేసు విచారణ అనంతరం బొబ్బిలి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు జడ్జి ఎం.సరోజనమ్మ వాస్తవాలు నిర్ధారించి ముద్దాయికి పైవిధంగా శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు. ఈ కేసును అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ నరేశ్ వాదించారు.

షూటింగ్‌బాల్ పోటీల్లో జిల్లాకు ద్వితీయ స్థానం



షూటింగ్ బాల్ పోటీల్లో ద్వితీయ స్థానం దక్కించుకున్న జిల్లా క్రీడాకారులు

విజయనగరం: రాష్ట్రస్థాయిలో జరిగిన షూటింగ్ బాల్ పోటీల్లో జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించిన పురుషుల జట్టు సత్తా చాటింది. ఈనెల 8,9,10 తేదీల్లో నెల్లూరు జిల్లా కావలి వేదికగా జరిగిన అంతర్ జిల్లాల పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు ద్వితీయ స్థానం దక్కించుకున్నారు. రాష్ట్రస్థాయి పోటీల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులను జిల్లా షూటింగ్ బాల్ అసోసియేషన్ కార్యదర్శి పి.కృష్ణమూర్తి, ధర్మారావు, ఆనంద్, ప్రసాద్‌లు అభినందించారు.

నియామక పత్రాల అందజేత



కారుణ్య నియామక పత్రాలు అందజేస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

విజయనగరం రూరల్: కారుణ్య నియామకంలో ఆఫీస్ సబార్డినేట్‌లుగా ఉద్యోగం పొందిన ముగ్గురికి జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మంగళవారం నియామక పత్రాలు అందజేశారు. ఆయన కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో జెడ్పీ సీఈవో రాజ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

రెండు నెలల బాలింత మృతి

కురుపాం: మండలంలోని గొటివాడ పంచాయతీ బల్లుకోట గ్రామానికి చెందిన రెండు నెలల బాలింత మృత్యువాత పడింది. బల్లుకోటకు చెందిన కొండగొర్రి సుశీల(30) రెండు నెలల క్రితం మగబిడ్డకు జన్మనిచ్చింది. అప్పటి నుంచి విరోచనం అవకపోవడంతో కడుపు నొప్పితో ఇబ్బంది పడి రేగిడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లగా సుఖ విరోచనం అయ్యేందుకు మందులిచ్చి పంపారు. సమస్య యథాతథంగా ఉండడంతో కుటుంబసభ్యులు పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి సోమవారం తరలించారు. అక్కడి వైద్యులు పరీక్షలు చేసి వైద్యం అందించి రిపోర్టులో ఆరోగ్యం బాగా ఉందని ఇంటికి పంపించారు. అయితే సోమవారం రాత్రి ఇంటికి చేరాక ఆమె తుదిశ్వాస విడిచింది. భర్త కుమార్, బంధువులు రెండు నెలల మగ బిడ్డతో కన్నీరు మున్నీరుగా రోదించారు.

పాముకాటుతో మహిళ..

భామిని: మండలంలోని బొమ్మిక గ్రామానికి చెందిన గిరిజన మహిళ పాలక జయమ్మ (51)పాముకాటుతో మంగళవారం మృతి చెందింది. ఈనెల10తేదీ రాత్రి వడ్డంగి నుంచి బొమ్మిక వస్తున్న సమయంలో జయమ్మ పాముకాటుకు గురైంది. తెల్లవారే సరికి పాము కాటు గుర్తించి భామిని పీహెచ్‌సీకి తరలించారు.అనంతరం మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం రిమ్స్ తరలించి వైద్యసేవలు అందిస్తుండగా జయమ్మ(51)మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతురాలికి భర్త,ఇద్దరు పిల్లలున్నారు.

సీతంపేటలో ఎస్‌జీఎఫ్ ఎంపికలు



ఎంపికైన విద్యార్థులతో అధికారులు, సిబ్బంది

సీతంపేట: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు స్థానిక గ్రీన్‌ఫీల్డ్ స్టేడియంలో కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్, షటిల్‌బ్యాడ్మింటన్, యోగా, అథ్లెటిక్ ఎంపిక పోటీలు మంగళవారం నిర్వహించారు. 26 పాఠశాలలకు చెందిన సుమారు 500ల మంది విద్యార్థులు హాజరైనట్టు సంబంధిత సెలెక్షన్ కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమశాఖ డీడీ శ్రీనివాసరావు, డిప్యూటీఈఓ లిల్లీరాణి, ఐటీడీఏ స్పోర్ట్స్ ఇన్‌చార్జి జాకాబ్‌దయానంద్, పీడీలు ఆర్.సి.రెడ్డి, వెంకట్రావు, రమణమూర్తి, ఈశ్వరరావు, సూర్యనారాయణ, నాగేశ్వరరావు, సింహాచలం, శ్రీను, కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

డ్వాక్రా చెల్లింపులకు పేటీఎం

- అక్రమాలు అరికట్టేందుకు డిజిటల్ విధానం
- జిల్లాలోని మూడు మండలాల్లో పైలెట్ ప్రాజెక్ట్‌గా అమలు
- వీఓఏల వద్ద పేటీఎం స్కానర్‌లు



రేగిడి మండలంలో వీఓఏలకు పేటీఎం మిషన్లు అందిస్తున్న అధికారులు

రేగిడి: ఆర్థిక అక్షరాస్యత మహిళా సంఘాల్లో పెరిగింది. ప్రభుత్వం చేస్తున్న కృషి ఫలితంగా చిట్టి గురువులు కార్యక్రమం ద్వారా జిల్లాలో అక్షరాస్యత శాతం ఎక్కువైంది. ప్రధానంగా మహిళా సంఘాల్లో సభ్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దడంలో చిట్టిగురువులు ఉపయోగపడ్డారు. ఈ ఆర్థిక అక్షరాస్యతను సద్వినియోగం చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ప్రధానంగా డ్వాక్రా సంఘాల రుణ చెల్లింపులు, వినియోగం తప్పుదారి పట్టకుండా ఉండేందుకు డిజిటల్ విధానాన్ని ముందుకు తీసుకువచ్చింది.

పేటీఎంలో చెల్లింపు

ప్రస్తుతం అన్నిచోట్ల పేటీఎం చెల్లింపులు పెరిగాయి. చిల్లర దుకాణాలు, టీ షాపుల వద్ద కూడా పేటీఎం, ఫోన్‌పే ఉన్నాయి. వాటిని డ్వాక్రా సంఘాల్లో కూడా అమలుచేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం దృష్టిసారించింది. డ్వాక్రా సంఘాలను గ్రామస్థాయిలో ఆర్గనైజ్ చేస్తున్న విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్‌లకు వీటిని అందిస్తుంది. ఆయా గ్రామాల్లోని మహిళా సంఘాల సభ్యులు రుణాలు నెలవారీ చెల్లింపు చేయాలన్నా, పొదుపు నగదు చెల్లించాలన్నా వీఓఏలకు నేరుగా నగదు ఇవ్వకుండా పేటీఎం ద్వారా చెల్లించుకోవచ్చు. ఫలితంగా ఆర్థిక అక్రమాలకు చెక్ పడుతుంది.

తొలుత మూడు మండలాల్లో అమలు

పేటీఎంలు డ్వాక్రా సంఘాల్లో వినియోగానికి పైలెట్ పథకం కింద జిల్లాలో మూడు మండలాలను డీఆర్‌డీఏ ఎంపిక చేసింది. వాటిలో రేగిడి, జామి, నెల్లిమర్ల మండలాలు ఉన్నాయి. ఈ మండలాల్లో వీఓఏలకు పేటీఎం స్కానర్‌లను వైఎస్ఆర్ క్రాంతి పథకం అధికారులు అందజేశారు. ఆయా మండల కేంద్రాల్లోని వైఎస్ఆర్ క్రాంతి పథం కార్యాలయాల్లో ఈ మేరకు ఒక్కోరోజు వీఓఏలకు శిక్షణ అందించారు. వీరు గ్రామాల్లో గ్రామైక్య సంఘాలు, గ్రామ సంఘాల్లోని మహిళలకు అవగాహన కల్పిస్తారు. నేరుగా మహిళలు వారి ఆండ్రాయిడ్ మొబైల్ ద్వారా చెల్లింపులు చేసుకోవచ్చు. ఈ విధానంతో డిజిటల్ చెల్లింపులు పెరగడమే కాకుండా లబ్ధిదారులకు ఎటువంటి ఆర్థిక నష్టం జరగకుండా ఉంటుంది.

చాలా మంచి కార్యక్రమం



జిల్లాలోని మహిళా సంఘాల్లో 90 శాతం మంది సభ్యులు ఆర్థిక అక్షరాస్యత ఉన్నవారే. మిగిలినవారి కుటుంబాల్లో కూడా చదువుకున్నవారు ఉన్నారు. పేటీఎం ద్వారా డిజిటల్ చెల్లింపులు చేస్తే ఆర్థిక అక్రమాలు తగ్గుతాయి. ప్రభుత్వం చేస్తున్న ఈ కార్యక్రమం ప్రయోగాత్మకంగా జిల్లాలో ప్రారంభమై ఫలితాలు ఇస్తోంది. ఈ ప్రాజెక్ట్ ఆధారంగా జిల్లా మొత్తం వీటి వినియోగాన్ని పెంచుతాం.

ఎ. కల్యాణ చక్రవర్తి, డీఆర్‌డీఏ పీడీ, విజయనగరం.

మర్యాదతో మరింత ఆదరణ

- డ్రైవర్లు, కండక్టర్లకు నిపుణులతో కౌన్సెలింగ్
- వారంలో ఒక రోజు జోనల్ స్టాఫ్ ట్రైనింగ్ కాలేజీలో నిర్వహణ
- ఫిర్యాదుల నేపథ్యంలో ఆర్టీసీ ఉన్నతాధికారుల చర్యలు



కండక్టర్లు, డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న డిప్యూటీ సీటీఎం అప్పలనాయుడు

సాక్షి, విశాఖపట్నం: ప్రయాణికుల పట్ల సిబ్బంది మర్యాదగా వ్యవహరించడంపై ఆర్టీసీ అధికారులు ఫోకస్ పెడుతున్నారు. పాసింజర్ల మన్ననలు పొందడానికి ప్రాధాన్యమిస్తున్నారు. ఇందుకోసం ఆర్టీసీ కండక్టర్లు, డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్నారు. ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే వారి పట్ల కొంతమంది డ్రైవర్లు, కండక్టర్లు దురుసుగా ప్రవర్తిస్తున్నారని, ఏకవచనంతో సంబోధిస్తున్నారని, బస్సులు సక్రమంగా ఆపడం లేదని, దురుసుగా సమాధానం చెబుతున్నారని.. ఇలా పలు ఫిర్యాదులు ఆర్టీసీ కంప్లయింట్ సెల్‌కు అందుతున్నాయి. ఈ ఫిర్యాదులను ఆర్టీసీ యాజమాన్యం సీరియస్‌గా తీసుకుంది. ఇకపై కండక్టర్లు, డ్రైవర్లు ప్రయాణికులతో మర్యాదగా మెలిగేలా చర్యలు చేపట్టింది. ఇందుకోసం కంప్లెయింట్ సెల్‌కు అందిన ఫిర్యాదుల ఆధారంగా సంబంధిత కండక్టర్లు, డ్రైవర్లకు ప్రతి మంగళవారం కౌన్సెలింగ్ ఇవ్వాలని నిర్ణయించింది. ఆర్టీసీ జోన్-1కు సంబంధించి ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలో విధులు నిర్వహిస్తున్న ఈ కండక్టర్లు, డ్రైవర్లకు విజయనగరం జోనల్ స్టాఫ్ ట్రైనింగ్ కాలేజీలో కౌన్సెలింగ్ ఇస్తున్నారు. ఈ ప్రక్రియకు మంగళవారం నుంచే శ్రీకారం చుట్టారు. ఉదయం రెండు గంటలు, మధ్యాహ్నం రెండు గంటల చొప్పున ఆర్టీసీలో ఎంపిక చేసిన అధికారులతో పాటు బయట నుంచి నిపుణులు, లెక్చరర్లు, అడ్వకేట్లను కూడా రప్పించి వారితో సుహృద్భావ వాతావరణంలో కౌన్సెలింగ్ ఇప్పిస్తున్నారు. ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణికులతో మర్యాద పూర్వకంగా మెలగాలని, వారు అడిగిన ప్రశ్నలు, సందేహాలకు దురుసుగా కాకుండా సామరస్యంగా సమాధానం చెప్పాలని, చిరాకు ప్రదర్శించకుండా మాట తీరు గౌరవప్రదంగా ఉండాలని, వారిని ఏకవచనంతో సంబోధించవద్దని, ప్రయాణికుల మన్ననలు పొందాలని సూచిస్తున్నారు. ఈ కౌన్సెలింగ్ ద్వారా వీరి ప్రవర్తనలో మార్పు తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నారు. ఆర్టీసీ కండక్టర్లు, డ్రైవర్ల వ్యవహారశైలి ప్రయాణికులపై ప్రభావం చూపుతుందన్న భావనకు అధికార్లు వచ్చారు. కౌన్సెలింగ్ ద్వారా వీరు ప్రయాణికులతో స్నేహపూర్వకంగా మెలిగితే ఆర్టీసీపై ప్రయాణికుల ఆదరణ మరింత పెరుగుతుందని, ప్రైవేటు ఆపరేటర్ల వైపు మళ్లే అవకాశం ఉండదని వీరు భావిస్తున్నారు.

నిరంతరం కొనసాగిస్తాం...

ప్రయాణికులతో కండక్టర్లు, డ్రైవర్లు మర్యాదగా వ్యవహరించడం వల్ల ఆర్టీసీకి ప్రజల్లో ఆదరణ పెరుగుతుంది. దీంతో ప్రయాణికుల ఆక్యుపెన్సీ రేషియో పెరిగి ఆర్టీసీ ఆదాయం వృద్ధి చెందడానికి కూడా దోహదపడుతుంది. కంప్లయింట్ సెల్‌కు వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా సంబంధిత సిబ్బందికి బ్యాచ్‌కు 10–15 మంది చొప్పున ఎంపిక చేసి నిపుణులతో కౌన్సెలింగ్ ఇప్పిస్తున్నాం. దీనిని నిరంతరం కొనసాగిస్తాం.

– సి.రవికుమార్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, జోన్-1

విద్యార్థుల్లో సృజనాత్మకతకు యువజనోత్సవాలు

- రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో బ్యాడ్మింటన్, సైన్స్‌ఫెయిర్ పోటీలు



బ్యాడ్మింటన్ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులతో రోటరీ క్లబ్ ప్రతినిధులు



సైన్స్ ఫెయిర్‌లో వివిధ రకాల నమునాలు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

విజయనగరం: విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసి వారిని మరింత పోత్సహించాలనే ముఖ్య ఉద్దేశంతో రోటరీక్లబ్ ఆధ్వర్యంలో ప్రతి ఏడాది యువజన మాసోత్సవాలు నిర్వహిస్తున్నట్లు రోటరీ క్లబ్ విజయనగరం సెంట్రల్ అధ్యక్ష, కార్యదర్శులు ఉడత్తు రాజేష్, కార్యదర్శి అరుణ్‌లు పేర్కొన్నారు. మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన బ్యాడ్మింటన్ పోటీలు ఉత్సాహ భరిత వాతావరణంలో సాగాయి. పోటీల్లో 300 మందికి పైగా క్రీడాకారులు పాల్గొని ప్రతిభా పాటవాలను ప్రదర్శించారు. అదేవిధంగా నగరంలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో నిర్వహించిన సైన్స్‌ఫెయిర్ పోటీల్లో 30 మంది విద్యార్థులు పాల్గొని వివిధ రకాల నమూనాలు ప్రదర్శించారు. పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు అక్టోబర్2వ తేదీన బహుమతులు ప్రదానం చేయనున్నట్లు క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు వెల్లడించారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు జయకృష్ణ, మంచుకొండ అశోక్, సురేంద్రరెడ్డి, కృష్ణతేజ, శంకర్ రెడ్డి, అశోక్, టీఎల్ఎన్ మూర్తి, కట్టమూరి మధు, పూసర్ల మారుతి తదితరులు పాల్గొన్నారు.

మద్యం ధ్వంసం



కొట్టక్కి బ్రిడ్జి వద్ద ధ్వంసం చేస్తున్న మద్యం

సాలూరు: వివిధ కేసుల్లో పట్టుకున్న మద్యం, సారాలను పట్టణ పోలీసులు మంగళవారం ధ్వంసం చేశారు. వివిధ కేసుల్లో పట్టుకున్న 401 మద్యం బాటిల్స్, సుమారు 849.5 లీటర్ల సారాను ఎస్సీ,ఎస్టీ సెల్ డీఎస్పీ మురళీధర్, ప్రొహిబిషన్ అధికారుల సమక్షంలో పట్టణ సమీపంలోని కొట్టక్కి బ్రిడ్జి వద్ద పోలీసులు నాశనం చేశారు. కార్యక్రమంలో పట్టణ సీఐ శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

చైల్డ్‌వెల్ఫేర్ కమిటీల నియామకానికి చర్యలు

పార్వతీపురం: కొత్త జిల్లాలకు చైల్డ్ వెల్ఫేర్ కమిటీ, జువెనైల్ జస్టిస్ బోర్డుల ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని బాలల సంక్షేమం, సంస్కరణల సేవల శాఖ జిల్లా ప్రొబేషన్ అధికారి ఎం.శరత్‌బాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. చైల్డ్ వెల్ఫేర్ కమిటీ, జువెనైల్ జస్టిస్ బోర్డులు చైర్మన్, సభ్యులు సామాజిక కార్యకర్తల నియామకానికి దరఖాస్తు చేసుకునేందుకు గడువును అక్టోబర్ మూడో తేదీవరకు పొడిగించినట్లు చెప్పారు. అర్హులైన అభ్యర్థులు హెచ్‌టీటీపీ://డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

మూడేళ్ల బాలుడికి రూ.10వేల పింఛన్



బాలుడి కుటుంబానికి రూ.పదివేలు పింఛన్ అందజేస్తున్న స్థానిక ప్రజాప్రతినిధులు

చీపురుపల్లిరూరల్: పుట్టుకనుంచి తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చీపురుపల్లి మండలంలోని మెట్టపల్లి పంచాయతీ పరిధి ముల్లుపేట గ్రామానికి చెందిన మూడేళ్ల బాలుడు ముళ్ల భువన్ సాయికి ప్రభుత్వం రూ.10వేలు పింఛన్ మంజూరు చేసింది. ఈ మేరకు స్థానిక సచివాలయంలో పింఛన్‌ను బాలుడి తండ్రి ముల్లు సూరికి పీఏసీఎస్ అధ్యక్షుడు చందక గురునాయుడు, ఎంపీటీసీ మీసాల ఈశ్వరరావులు మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తలసీమియా వ్యాధితో బాధపడుతున్న విషయాన్ని ధీరా ఫౌండేషన్ అధినేత బొత్స సందీప్, మాజీ ఎంపీ బొత్స ఝాన్సీలక్ష్మిల దృష్టికి తీసుకువెళ్లగా వారు స్పందించి ఆరోగ్య మంత్రిత్వశాఖ అధికారులతో మాట్లాడి పింఛన్ మంజూరు చేయించారన్నారు. చిన్న బాలుడి కష్టానికి చలించి పింఛన్ మంజూరు చేయించిన బొత్స కుటుంబానికి తామంతా రుణపడి ఉంటామన్నారు. కార్యక్రమంలో సచివాలయం సిబ్బంది, గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.

పుష్పాలంకరణలో పైడితల్లి



ప్రత్యేక అలంకరణలో పైడితల్లి అమ్మవారు



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ పైడితల్లి అమ్మవారు మంగళవారం పుష్పాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఏడిద రమణ ఆధ్వర్యంలో అమ్మవారికి వేకువజామునుంచి పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఆలయ సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, తాళ్లపూడి ధనుంజయ్, మూలా పాపారావులు అమ్మవారికి కుంకుమార్చన చేశారు. మహిళలు అమ్మవారిని దర్శించి పసుపు, కుంకుమలను సమర్పించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయ ఈఓ కేఎల్.సుధారాణి కార్యక్రమాలను పర్యవేక్షించారు.

శరవేగంగా రైల్వేస్టేషన్ అభివృద్ధి



పార్వతీపురం రైల్వేస్టేషన్‌ను పరిశీలిస్తున్న డీఆర్ఎం సౌరవ్ ప్రసాద్

- రూ. 20కోట్లతో పనులు
- మోడ్రన్ ఎఫ్ఓబీ, రిజర్వేషన్ కౌంటర్ల ఏర్పాటు
- పరిశీలించిన డీఆర్ఎం సౌరవ్ ప్రసాద్

పార్వతీపురం టౌన్: పార్వతీపురం నూతన రైల్వేస్టేషన్ అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నట్లు రైల్వే డివిజనల్ రైల్వే మేనేజర్ (డీఆర్ఎం) సౌరవ్ ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన పార్వతీపురం బెలగాం రైల్వే స్టేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రూ. 20కోట్లతో పార్వతీపురం రైల్వే స్టేషన్ అమృత్ భారత్ పథకానికి ఎంపికై ందని చెప్పారు. పార్వతీపురం రైల్వేస్టేషన్‌కు సంబంధించి నూతన రైల్వేస్టేషన్ భవనం, మోడ్రన్ ఫ్లైఓవర్, ప్రస్తుతం ఉన్న ఫ్లై ఓవర్ సమీపంలో సాధారణ ఫ్లై ఓవర్, టికెట్ కౌంటర్, రిజర్వేషన్ కౌంటర్, ఫుడ్ ప్లాజా వంటి నూతన నిర్మాణాలు చేపడుతున్నామని తెలిపారు. సంవత్సరంలో పార్వతీపురం స్టేషన్ రూపురేఖలు మారుతాయని చెప్పారు. ప్రయాణికులకు అత్యాధునిక వసతులను సమకూర్చేందుకు అన్ని విధాలా చర్యలు చేపట్టామన్నారు. మూడవ రైల్వే లైన్ పనులు తుదిదశకు చేరుకున్నాయన్నారు. పార్వతీపురం నూతన జిల్లాగా ఏర్పడడంతో స్టేషన్ అభివృద్ధి, కమర్షియల్ కాంప్లెక్స్, పార్సిల్ సర్వీసులు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు స్థలాన్ని పరిశీలించామని, వాటిని త్వరలో అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. డీపీఎం సునీల్ కుమార్, ,సీనియర్ డీసీఎం ఏకె త్రిపాఠి, సీనియర్ డీఈ ఎస్‌డీ మీనా, స్టేషన్ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ విఘ్నేష్ తదితరులు పాల్గొన్నారు.

సాలూరు రైల్వేస్టేషన్ పరిశీలన

సాలూరు: డీఆర్ఎం (డివిజనల్ రైల్వే మేనేజర్) సౌరబ్ ప్రసాద్ సాలూరు రైల్వే స్టేషన్‌ను మంగళవారం పరిశీలించారు.సాలూరు వరకు ట్రైన్‌తో ట్రయిల్ రన్ నిర్వహించారు.ట్రాక్ నాణ్యత, రైల్వే స్టేషన్‌లో వసతులు, పరిసరాలు తదితర అంశాలను పరిశీలించారు. పూర్తిస్థాయిలో పనులు చేపట్టి, సాలూరు నుంచి విశాఖపట్నం రైలుసేవలు త్వరలో ప్రారంభిస్తామని ఈ సందర్భంగా తెలిపారు. ఆయన వెంట పలువురు రైల్వే అధికారులు ఉన్నారు. కాగా సాలూరుకు రైలు బస్సు కాకుండా పెద్ద రైలు రానుండడంతో స్థానికంగా సందడి వాతావరణం నెలకొంది.

విజయనగరంలో..

విజయనగరం టౌన్: ఈస్ట్‌కోస్ట్ రైల్వే డివిజనల్ మేనేజర్ సౌరభ్ ప్రసాద్ మంగళవారం విజయనగరం రైల్వే స్టేషన్‌ను పరిశీలించారు. ప్రత్యేక ట్రైన్‌లో వచ్చిన ఆయన విండో ట్రయయలింగ్ ద్వారా పర్యవేక్షించారు. కార్యక్రమంలో సీనియర్ డివిజనల్ ఇంజినీర్ కోఆర్డినేషన్ ఏకే.మెహరానా, సీనియర్ డివిజనల్ ఆపరేషన్స్ మేనేజర్ జి.సునీల్, సీనియర్ డీసీఎం ఏకే .త్రిపాఠి, సీనియర్ డీఈఈ ఆపరేషన్స్ శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలిలో డీఆర్ఎం

బొబ్బిలి: త్వరలో విశాఖ షటిల్‌ను బొబ్బిలి మీదుగా సాలూరు వరకూ నడిపేందుకు రైల్వే శాఖ సిద్ధమైన నేపథ్యంలో లైన్‌పరిశీలనకు డీఆర్ఎం సౌరవ్ ప్రసాద్ సోమవారం బొబ్బిలి రైల్వేస్టేషన్ నుంచి సాలూరు లైన్‌ను పరిశీలించారు. అక్కడి ప్రయాణికులు, బొబ్బిలిలో రైల్వే సిబ్బందితో మాట్లాడారు. అనంతరం బొబ్బిలి రైల్వే స్టేషన్‌ను తనిఖీ చేశారు.

ఐటీఐలో విద్యార్థినులకు ప్రవేశాలు

సీతంపేట: స్థానిక ఐటీఐలో గిరిజన మహిళా అభ్యర్థులకు వివిధ ట్రేడ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ మూటక గోపాలకృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎలక్ట్రిషియన్, ఫిట్టర్, మోటారు మెకానిక్ వెహికల్, వెల్డర్, డ్రెస్‌మేకింగ్, కోపా కోర్సుల్లో ప్రవేశాలు ఉంటాయన్నారు. ఆన్‌లైన్‌లో ఈనెల 19 వ తేదీలోగా రిజిస్టర్ చేసుకున్న అభ్యర్థులకు ఈనెల 22న స్థానిక ఐటీఐలో కౌన్సెలింగ్ చేస్తామన్నారు. సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ఈ నెల 20వ తేదీలోగా చేసుకోవాలన్నారు. వివరాలకు సెల్: 99893 86634, 63053 02188 నంబర్లను సంప్రదించాలని కోరారు.

ఏం కష్టమొచ్చిందో...?

- వ్యవసాయ బావిలో పడి కుమార్తెతో కలిసి దంపతుల ఆత్మహత్య
- కొత్తవలస మండలం చింతలపాలెం సమీపంలో ఘటన
- మృతులు విశాఖపట్నం జిల్లా మద్రిపాలెం వాసులుగా గుర్తింపు
- ఘటనా స్థలాన్ని సందర్శించిన విజయనగరం డీఎస్పీ ఆర్.గోవిందరావు



మృతులు మొహిసుద్దీన్, భార్య నిషా, కుమార్తె జహీదా (ఫైల్)



బావిలో తేలియాడుతున్న మృతదేహాలను పరిశీలిస్తున్న సీఐ చంద్రశేఖర్

కొత్తవలస: ఆ కుటుంబానికి ఏం కష్టమొచ్చిందో తెలియదు. ఆరోగ్యం, ఆర్థికంగా బాగానే ఉన్నా... ఊరు కాని ఊరు వచ్చి కుమార్తెతో కలిసి దంపతులిద్దరూ ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ ఘటన విజయనగరం జిల్లా కొత్తవలస మండలం చింతలపాలెం గ్రామ సమీపంలో మంగళవారం చోటుచేసుకోంది. పోలీసులు, స్థానికులు, మృతుల కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం..

విశాఖపట్నంలోని షిప్పింగ్ కంపెనీలో ఎగ్జిక్యూటివ్‌గా పనిచేస్తూ ఆ జిల్లాలోని మద్రిపాలెం సమీపంలోని ఎఫ్‌సీఐ కాలనీలో నివసిస్తున్న మహ్మద్ మొహిసుద్దీన్ (46), ఆయన భార్య సంషి నిషా (38), కూతురు ఫాతిమా జహీదా (17)లు చింతలపాలెం సమీపంలోని వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డారు. మృతులు చింతలపాలెం గ్రామ సమీపంలో గతంలో కొంత భూమిని కొనుగోలు చేశారు. ఈ భూమిని చూసేందుకు క్యాబ్‌ను బుక్‌చేసుకుని ఇంటి నుంచి సోమవారం వచ్చారు. సాయంత్రం వరకు ఆ ప్రాంతంలో తిరిగినట్టు స్థానికులు చెబుతున్నారు. ఏ సమయంలో బావిలో దూకారో తెలియరాలేదు. బావిగట్టుపై మృతుడికి చెందిన సెల్‌ఫోన్, తమ బంధువులకు సంబంధించిన ఫోన్ నంబర్లు రాసిన కాగితం, ఇతర వస్తువులు ఉండడాన్ని స్థానికులు గుర్తించారు. బావిలోకి చూడగా మృతదేహాలు తేలియాడడం గుర్తించి పోలీసులకు సమాచారమిచ్చారు. దీంతో సీఐ ఎస్.చంద్రశేఖర్ తన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకున్నారు. అక్కడ దొరికిన ఆధారాలతో ఫోన్ చేసి మృతుడు మొహిసుద్దీన్ కొడుకు మహ్మద్ ఆలీకి సమాచారం అందించారు. మృతుల కటుంబ సభ్యులు, బంధువులు ఘటనా స్థలానికి చేరుకొని మృతులను గుర్తించారు. ఆలీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు శవ పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను ఎస్.కోట సీహెచ్‌సీకి తరలించినట్లు సీఐ చంద్రశేఖర్ తెలిపారు. మృతురాలు జహీద విశాఖపట్నంలోని ఓ ప్రైవేటు కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతోంది. కొడుకు ఆలీ ఎంబీఏ చదువుతున్నాడు.

ఘటనా స్థలాన్ని పరిశీలించిన డీఎస్పీ

ఘటనా స్థలాన్ని విజయనగరం డీఎస్పీ ఆర్.గోవిందరావు సందర్శించారు. క్లూస్ టీమ్‌తో క్షుణ్ణంగా పరిశీలించారు. అన్ని కోణాల్లోనూ పరిశీలిస్తున్నట్టు ఆయన తెలిపారు. మృతుల సెల్‌ఫోన్‌లను ఓపెన్ చేసి కాల్‌డేటాను సేకరిస్తున్నట్టు డీఎస్పీ తెలిపారు. కాల్ డేటా సేకరిస్తే ఆత్మహత్యకు గల కారణాలు తెలిసే అవకాశం ఉంటుందన్నారు.